ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
బుధవారం 14 ఆగస్టు 2024



అసైన్డ్ భూముల రైతులకు నోటీసులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13: మండల పరిధిలోని నాగన్‌పల్లి రెవెన్యూ అసైన్డ్ భూముల నుంచి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ అక్రమంగా రోడ్డు వేస్తున్నట్లు వచ్చిన ఆరోపణలు వచ్చాయి. ఆ పనులు నిలిపివేసి సంబంధిత రైతులకు నోటీసులు ఇచ్చినట్లు తహసీల్దార్ సునీతారెడ్డి తెలిపారు. సర్వేనంబర్ 189లో 178.33 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో 11.35 ఎకరాల భూమిని 8మంది రైతులకు అసైన్డ్ పట్టాలిచ్చారు. అందులో నుంచి ఓ ప్రైవేట్ సంస్థ రోడ్డు వేస్తున్నట్లు తెలిసి పనులు నిలివివేశామన్నారు. ఈ విషయమై పూర్తి విచారణ చేస్తున్నామని తెలిపారు. నోటీసులకు రైతుల నుంచి వివరణ వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

పాతాళంలోనే గంగమ్మ

వర్షాలు కురిసినా పెరగని భూగర్భజలాలు



భూగర్భ జలాల పరిస్థితి (మీటర్లలో..) జిల్లా	జులై 2023	జులై 2024	తగ్గుదల శాతం
రంగారెడ్డి	8.96	13.08	-4.12
వికారాబాద్	9.74	12.61	-2.87
మేడ్చల్	9.48	11.99	-2.51

ఈ ఏడాది అనేక ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసినా ఉమ్మడి జిల్లాలో భూగర్భ జలాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. సాధారణంగా సగటు వర్షపాతం నమోదైతే జలాశయాలు నిండి భూగర్భజలాలు పెరుగుతాయి. కానీ ఈ ఏడాది పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. మూడు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనా (సగటుకు 20శాతం తక్కువ లేదా ఎక్కువ కురిసినా సాధారణ వర్షపాతం కింద లెక్కిస్తారు) భూగర్భజలాలు మాత్రం ఆ స్థాయిలో పెరగలేదు. రాష్ట్రంలో అతి తక్కువ భూగర్భజలాలు నమోదైన జిల్లాల్లో మూడు జిల్లాలు(రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్) ఉండటం గమనార్హం.

గతేడాది కంటే 4.12మీటర్ల లోతులో నీటి మట్టం

- మూడు జిల్లాల్లోనూ నిండని జలాశయాలు
- వానాకాలం సాగుపై తీవ్ర ప్రభావం
- సగటు కంటే తగ్గిన సాగు విస్తీర్ణం
- రంగారెడ్డి జిల్లాలో కేవలం 45 శాతమే సాగు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

రంగారెడ్డి జిల్లాలో పరిస్థితి దారుణంగా ఉంది. ఆగస్టు నెల దాదాపు సగం గడిచినప్పటికీ భూగర్భజలాలు సాధారణ స్థాయికి చేరలేదు. గత ఏడాదితో పోలిస్తే రాష్ట్రంలో అతి తక్కువ భూగర్భ జలాలు ఉన్న జిల్లాల్లో రంగారెడ్డి నాలుగో స్థానంలో ఉంది. గతేడాది జులై 31తో పోలిస్తే ఈ ఏడాది జులై 31 నాటికి రంగారెడ్డి జిల్లాలో 4.12 మీటర్ల భూగర్భ నీటి మట్టం తగ్గింది. అలాగే వికారాబాద్‌లో దాదాపు 18 శాతం అధిక వర్షపాతం నమోదైనా 2.87 మీటర్ల నీటి మట్టాలు తక్కువగా నమోదయ్యాయి. ఇక మేడ్చల్ జిల్లాలోనూ గతేడాదితో పోలిస్తే 2.51 మీటర్లలోతులోనే భూగర్భ జలాలు ఉన్నాయి. భూగర్భజలాలు ఇంకా పెరగని కారణంగా విస్తారంగా వర్షాలు పడుతున్నా చెరువులు, కుంటల్లో నీరు కనిపించడం లేదు. రంగారెడ్డి జిల్లాలోని అతిపెద్ద జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లు కూడా పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోలేదు. గత ఏడాది ఇదే సమయానికి ఈ రెండు జలాశయాలు నిండడంతో గేట్లు ఎత్తి కిందకు నీరు వదిలారు. ఇంకా మిగతా ప్రాంతాల్లోని చెరువులు, కుంటల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇబ్రహీంపట్నం చెరువు కూడా ఇంకా నిండని పరిస్థితి. దాదాపు 2వేల ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువులో నీరు ఇంకా కిందకు వదల్లేదు. గతేడాది నుంచి ఈ చెరువులో నీరు అలానే ఉంచడంతో ఏదో కొంత నీరు కనిపిస్తుంది. ఈ ఏడాది చెరువులోకి నీరు రాకపోవడంతో వేసవి నుంచి నీటిమట్టం ఒక్క అడుగు కూడా పెరగలేదు. 42 అడుగుల గరిష్ట నీటిమట్టం ఉన్న చెరువులో ఇపుడు 22 అడుగుల నీరు మాత్రమే ఉంది.

విచ్చలవిడిగా నీటి వినియోగం

వికారాబాద్ జిల్లాలోని కోట్‌పల్లి ప్రాజెక్టు, శివసాగర్ ప్రాజెక్టులు కూడా ఇంత వరకు నిండలేదు. ఇదిలా ఉండగా పలు ప్రాంతాల్లో విచ్చలవిడి నీటి వాడకంతో శరవేగంగా భూగర్భజలాలు తరిగిపోతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందించడం వల్ల కొందరు రైతులు అవసరం లేకున్నా నీటిని తోడేస్తున్నారు. అనేక ప్రాంతాల్లో నిరంతరం వ్యవసాయ మోటార్లను వినియోగిస్తున్నారు. దీంతో పాటు పరిశ్రమలకు కూడా నీటి వినియోగం భారీగా పెరిగింది. హైదరాబాద్ చుట్టు పక్కల కాలనీలు పెరగడంతో పాటు, కొత్త పరిశ్రమలు వస్తుండడంతో శివారులో జనాబా గణనీయంగా పెరుగుతోంది. దీనికి అనుగుణంగా నీటి వినియోగం సైతం పెరిగింది. ఈ కారణంగా శరవేగంగా భూగర్భజలాలు పడిపోతున్నాయి. సాధారణ వర్షపాతం నమోదైనా భూగర్భజలాలు పెరగడం లేదు.

సాగు అంతంతమాత్రమే..

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు పెరగకపోవడం పంటల సాగుపె తీవ్ర ప్రభావం పడింది. పలు చోట్ల విస్తీరంగా వర్షాలు కురిసినా భూగర్భజలాలు అంతంత మాత్రంగా ఉండడంతో కురిసిన వర్షపు నీరంతా భూమిలోకి ఇంకుతోంది. దీంతో భూమిలో తేమ ఎక్కువ లేకపోవడంబతో రైతులు ఆశించిన స్థాయిలో పంటలు సాగు చేయలేకపోయారు. రంగారెడ్డి జిల్లాలో ఆగస్టు రెండో వారానికి కూడా సగం విస్తీర్ణంలో కూడా రైతులు సాగు చేయలేకపోయరంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వికారాబాద్‌లో కొంత పరిస్థితి మెరుగ్గానే ఉంది. ఇక మేడ్చల్‌లోనూ అంతంతమాత్రంగానే పంటలు సాగు చేశారు.

వికారాబాద్‌లో అధిక వర్షం.. అయినా

ఈ ఏడాది వికారాబాద్ జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురిశాయి. వికారాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు 352.7మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా దీనికి మించి 417.3 మి.మీ వర్షం కురిసింది. దాదాపు 18శాతం అధిక వర్షపాతం నమోదైంది. కానీ ఇక్కడ దాదాపు రెండున్నర శాతం భూగర్భజలాలు గతేడాది కంటే తక్కువగా ఉన్నాయి.

వర్షపాతం నమోదు (మి.మీలలో) జిల్లా	సగటు	కురిసింది	శాతం
రంగారెడ్డి	293.8	273.8	-7.0
వికారాబాద్	352.7	417.3	+18.0
మేడ్చల్	339.1	307.6	-9.0

సాగు విస్తీర్ణం (జిల్లాల వారీగా ఎకరాల్లో) జిల్లా	సాధారణం	ప్రస్తుతం	శాతం
రంగారెడ్డి	3,96,899	1,78,182	44.89
వికారాబాద్	5,77,508	4,39,939	76.18
మేడ్చల్	23,026	9,596	41.67

పత్తాలేని వానలు!


ముఖం చాటేసిన వరుణుడు

- ఎండుముఖం పడుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

పరిగి, ఆగస్టు 13: వానకాలం ప్రారంభమై రెండున్నర నెలలు గడస్తున్నా ఆశించిన స్థాయిలో వర్షాలు లేవు. దీంతో సాగుపై తీవ్ర ప్రభావం పడింది. మృగశిర కార్తె రోజును మురిపించిన చిన్నపాటి వర్షాలు తిరిగి కానరాకుండా పోయాయి. అప్పట్లో కురిసిన వానకు విత్తుకున్న పత్తి, మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తి తడి అందక వాడిపోతున్నాయి. నల్లరేగడి భూముల్లో పంటలు కాస్త బాగున్నా ఎర్ర చెలక భూముల్లో పంటలు ఇప్పటికే ఎండుముఖం పట్టాయి. జూన్‌లో కురిసిన వర్షాలు, జూలైలో పత్తాలేకుండా పోయాయి. జిల్లాలో అక్కడక్కడ చిరుజల్లులు కురుస్తున్నా పరిగి నియోజకవర్గంలో అసలే లేని పరిస్థితి. పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో పంటల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం పంటలకు ఎరువులు వేసే సమయం కాబట్టి వర్షం కురిస్తే ఆశాజనకంగా ఉండేది. ఇలాగే మరో వారం రోజులు వానాలు రాకపోతే పంటలపై ఆశలు వదులుకోవాల్సిందేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిగి సబ్ డివిజన్‌లోని పరిగి, దోమ, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో 200లకుపైగా చెరువు, కుంటలున్నాయి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసినా పరిగిలో మాత్రం ఆశించిన వర్షాలు లేక తటాకాలు వెలవెలబోతున్నాయి. దీంతో చెరువుల కింద ఈ సారి కూడా పంట సాగుకు నోచుకునే పరిస్థితి. సబ్ డివిజన్‌లోని ప్రధానంగా లక్నాపూర్, అంతారం పాటిమీదు చెరువు, రాయన్‌చెరువు, ఇబ్రహింపూర్, దోమ పెద్దచెరువు, ఐనాపూర్, కిష్టాపూర్, ముజాహిద్, కులకచర్ల చెరువుల్లో నేటికీ నీరు చేరని పరిస్థితి.




దోమ మండలం బాసుపల్లిలో నీరు లేక వాడిన మొక్కజొన్న పంట



నీరు లేక వెలవెలబోతున్న తిమ్మాయిపల్లి చెరువు

అవినీతి జలగలు!



- కాసులిస్తేనే ఫైలు కదిలేది
- అవకాశంగా మారిన 'ధరణి' లొసుగులు
- లంచాలకు పీడిస్తున్న పలువురు అధికారులు
- వరుసగా ఏసీబీకి దొరకుతున్నా మారని తీరు
- తాజాగా పట్టుబడిన అదనపు కలెక్టర్
- కలకలం రేపుతున్న అధికారుల వ్యవహారం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 13) :

రెవెన్యూశాఖలోని అవినీతి జలగలు జనాలను పీల్చి పిప్పి చేస్తున్నాయి. ఎంత మంది ఏసీబీకి పట్టుబడినా.. ఎన్ని అరెస్టులు జరిగినా.. ఏ మాత్రం జంకడం లేదు. పాలకుల ఉదాసీనత రెవెన్యూ ఉద్యోగులకు వరంగా మారింది. ఉన్నత హోదాలో కొనసాగుతూ ఆదర్శంగా ఉండాల్సిన కొందరు ఉద్యోగులు అడ్డదారులు తొక్కుతున్నారు. రెవెన్యూశాఖలో అధికారులు, సిబ్బంది వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నా ఎవరిలో ఇసుమంతైన మార్పు కనబడటం లేదు. లంచం తీసుకోవడం నేరమని తెలిసినా భారీగా డిమాండ్ చేస్తున్నారు. చిన్నా చితక ఉద్యోగులే కాదు.. ఉన్నత స్థాయి వారు సైతం లంచాలకు మరుగుతున్నారు.

కాసులు కురిపిస్తున్న లొసుగులు

ధరణి పోర్టల్‌లో కోర్టు కేసులు, పాస్ పుస్తకాల్లో మార్పులు, మ్యుటేషన్ మార్పు కోసం వచ్చిన 98 దస్త్రాలు కలెక్టర్ ఆమోదం లేకుండానే ధరణిలో ఆమోదం లభించింది. దాదాపుగా రూ.వంద కోట్ల విలువైన భూములు చేతులు మారాయి. ధరణి సమన్వయ అధికారి నరేశ్, ఆపరేటర్ మహేశ్‌లపై ఆదిభట్ల పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఇంతకు ముందు కలెక్టర్‌గా పనిచేసిన భారతీ హోలీకేరీపై బదిలీ వేటు పడింది. ధరణిలోని లొసుగులు జిల్లాలోని కొంత మంది రెవెన్యూ అధికారులు, సిబ్బంది, బ్రోకర్లకు కాసులు కురిపిస్తున్నాయి. ఏళ్లగా వివాదాల్లో ఉన్న భూములకు సంబంధించి పట్టాదారులుగా మార్చేందుకు, భూ విస్తీర్ణాన్ని రికార్డుల్లో చేర్చేందుకు డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. కార్యాలయాల చుట్టు తిరిగే వారు, భూ సమస్యలపై దరఖాస్తులు అందించిన సామాన్య రైతులే వీరి లక్ష్యంగా ఈ దందా సాగిస్తున్నట్లు తెలుస్తోంది. వీలును బట్టి భూములను, రికార్డులను సరి చేస్తామని బాధితుల నుంచి రూ. లక్షల్లో వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పట్టణ శివారు గ్రామాల్లో మరింత ఎక్కువగా డబ్బులు వసూళ్లు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. అడిగినంత ఇవ్వకుంటే భూ రికార్డులను వివాదాల జాబితాలో చేర్చుతామంటూ బెదిరిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెప్పులరిగేలా తిరగాల్సిందే..

రెవెన్యూశాఖలో ఏ చిన్న పని కోసం వెళ్లినా.. పైసలు లేనిదే ఫైల్ కదలడం లేదు. లంచం ఇచ్చుకోలేని వారు అధికారుల చుట్టూ చెప్పులరిగే తిరగాల్సిందే. అలా తిరిగినా పని అవుతుందన్న నమ్మకం లేదు. జిల్లాలోని రెవెన్యూశాఖలో అధికారులు, సిబ్బంది వరుసగా ఏసీబీకి పట్టుబడుతున్నా ఎవరిలో ఇసుమంతైన మార్పు కనబడటం లేదు. కొందరు ఏసీబీ నుంచి తప్పించుకునేందుకు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని రూ.లక్షల్లో లంచాలు తీసుకుంటున్నారు. భూ రికార్డుల శుద్ధీకరణ రెవెన్యూ అధికారులు, సిబ్బంది, కొందరు బ్రోకర్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు.

మధ్యవర్తులుగా ప్రైవేటు వ్యక్తులు

ఏసీబీ అధికారులకు దొరక్కుండా ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తున్నది. లంచాల స్వీకరణకు ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వచ్చిన సొమ్ములో వారికి భాగం పంచుతున్నట్లు సమాచారం. అధికారులు నియమించుకున్న ఆ వ్యక్తులు ఎప్పుడూ కార్యాలయం చుట్టే తిరుగుతారన్న ఆరోపణలున్నాయి. వీళ్ల ఆఫీసు సిబ్బందిని కూడా హడలెత్తిస్తారని వినికిడి. పెద్ద సారు రిక్రూట్ చేసిన వ్యక్తులు కాబట్టి సిబ్బంది ఆఫీసర్ల ఆ ప్రైవేటు సైన్యానికి లొంగాల్సిందేనన్న విమర్శలున్నాయి.

గతంలో ఏసీబీకి చిక్కిన వారిలా..

- గతంలో ఉన్నతాధికారి (జాయింట్ కలెక్టర్) జగన్మోహన్‌రావు ఏసీబీకి చిక్కాడు.
- కేశంపేట తహసీల్దారు లావణ్య ఇంట్లో రూ.93 లక్షలు పట్టుబడ్డాయి. అలాగే ఆర్ఐ అనంతయ్య ఏసీబీకి పట్టుబడ్డారు.
- కందుకూరు మండలంలో పనిచేసిన మంచిరెడ్డి మహేందర్‌రెడ్డి ఎన్నికల ముందు సాధారణ బదిలీలల్లో నల్లగొండ జిల్లా మర్రిగూడకు వెళ్లి అదే రోజే ఏసీబీకి దొరికిపోయాడు. అతని వద్ద రూ.2 కోట్ల నగదును ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. అలాగే ఎంపీవో కళ్యాణి, పంచాయతీ కార్యదర్శి నరేందర్ కూడా పట్టుబడ్డారు.
- కొందుర్గు వీఆర్వో అనంతయ్య రూ.4 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి దొరికాడు.
- గొర్రెల పంపిణీ స్కాంతో సంబంధం ఉన్న ఇద్దరు జిల్లా స్థాయి అధికారులు అంజిలప్ప, భూగర్భ జల వనరుల శాఖ అధికారి రఘుపతిది సైతం ఏసీబీ వలలో ఇరుక్కున్నారు.
- తుర్కయాంజల్‌కు చెందిన ఓ వీఆర్వో, మున్సిపాలిటీ పరిధిలోని ఓ బిల్ కలెక్టర్ ఇటీవలే పట్టుబడ్డారు. నాలుగేళ్ల క్రితం సీనియర్ అసిస్టెంట్ శేఖర్‌రెడ్డి, శంషాబాద్ మండలంలోని నర్కుడ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనర్సింహ, కారోబార్ నాగరాజు రూ.35 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు.
- శంషాబాద్ మండలం నానాజీపూర్ పంచాయతీ కార్యదర్శి రాధిక, బిల్ కలెక్టర్ బాల్‌రాజ్ సైతం రూ.35 వేలు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.
- నెలన్నర క్రితం జిల్లాలో ముగ్గురు ఇరిగేషన్ అధికారులు ఏసీబీ వలలో చిక్కారు.
- మణికొండలో ఓ బిల్డింగ్ నిర్మాణానికి ఎన్‌వోసైతం ఇచ్చేందుకు రూ.లక్ష లంచం తీసుకుంటూ సర్కిల్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. భన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్లు కె. కార్తీక్, హెచ్ నికేశ్‌కుమార్‌తో పాటు నాలాపై సర్వే చేసేందుకు రూ.40 వేలు లంచం అడిగిన గండిపేట మండల సర్వేయర్ గణేశ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.
- అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బాటసింగారం, తారమతిపేట భూదాన్ భూమిలో ఇంటి నంబర్లు జారీ కేసులో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు ఏసీబీకి చిక్కారు.
- మత్స్యశాఖ జిల్లా అధికారి సుకీర్తిపై వచ్చిన అవినీతి ఆరోపణలతో ఆమె సస్పెన్షన్‌కు గురైంది.
- తాజాగా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, కలెక్టరేట్ ఇ-సెక్షన్ సీనియర్ అసిస్టెంట్ మదన్‌మోహన్‌రెడ్డి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడటం తీవ్ర కలకలం రేపుతోంది. పైసా లేనిదే కలెక్టరేట్‌లో ఏ ఫైలు కదటం లేదని తెలుస్తోంది. ఏసీబీ అధికారులకు ఇంతలా పట్టుబడుతున్నా.. అధికారుల తీరు మారడం లేదు. అందినకాడికి దోచుకోవడం పరిపాటిగా మారింది.

ఎయిర్‌పోర్టులో హై అలర్ట్

శంషాబాద్ రూరల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విమానాశ్రయంలో 20వ తేదీ వరకు హై అలర్ట్ ఉంటుందని మంగళవారం పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. ప్రయాణికుల రాకపోకలపై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు శంషాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. అలాగే సందర్శకుల పాస్‌ల జారీని నిలిపివేశామని పేర్కొన్నారు.



ఎయిర్‌పోర్టులో బలగాల పహారా

పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి

- మోడల్‌స్కూల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి

మహేశ్వరం, ఆగస్టు 13: కృషి పట్టుదలతో విద్యనభ్యసించి ప్రతీ విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మోడల్ స్కూల్ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి సూచించారు. మంగళవారం మహేశ్వరం మోడల్‌స్కూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా అదునాతనమైన వసతులతో కూడిన ఈ స్కూల్లో చదివే ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి చేరాలన్నారు. మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతీ పరీక్షా పలితాల్లో రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించేలా కృషి చేస్తున్న ప్రిన్సిపాల్ ధనుంజయ్, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విలువైన సమయాన్ని వృథా చేయకుండా ఉన్న అన్ని వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ చదువుతూ ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించుకోవడం మామూలు విషయం కాదని ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించుకున్న విద్యార్థులను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో మానిటరింగ్ అధికారి మంజరీ, పాఠశాల ప్రిన్సిపాల్ ధనుంజయ్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థితో మాట్లాడుతున్న శ్రీనివాసచారి

ఆమనగల్లులో భారీ వర్షం



ఇళ్ల మధ్యన చేరిన నీరు



జలమయమైన హైదరాబాద్ - శ్రీశైలం రహదారి

ఆమనగల్లు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వానతో రోడ్లు జలమయమయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలో ప్రేమ్ నగర్ కాలనీలో ఇళ్ల మధ్య భారీగా నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై వరద భారీగా చేరింది. ఈ వర్షం పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆమనగల్లు, ఆగస్టు 13

ఉత్తముల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లాలో 'ఉత్తమ ఉపాధ్యాయ-2024' ఎంపికకు అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో విజయకుమారి మంగళవారం తెలిపారు. సెప్టెంబరు 5న నిర్వహించనున్న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి, అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు ఎట్టి పరిస్థితిలో స్వీకరించం అని ఆమె పేర్కొన్నారు.

వ్యాపారులు వాహనదారులకు ఇబ్బంది కల్గించొద్దు

చేవెళ్ల, ఆగస్టు 13: రోడ్డు పక్కన చిరు వ్యాపారం చేసుకుంటున్న వారు వాహనదారులకు, పాదచారులకు ఇబ్బంది కలగకుండా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం తెలిపారు. మంగళవారం చేవెళ్లలో రోడ్డు పక్కన పండ్లు, కూరగాయల దుకాణాదారులకు ట్రాఫిక్ ఇబ్బందులపై అవగాహన కల్పించారు. వినియోగదారులను ఎక్కువసేపు బండ్ల వద్ద నిలబెట్టుకోవద్దని, కొనుగోలుదారులు రోడ్డుపై వాహనాలు నిలపకుండా చూసుకోవాలన్నారు. అలాగే సాయంత్రం పామెన స్టేజీ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ట్రాఫిక్ రూల్స్‌పాటించాలని ట్రాఫిక్ సీఐ తెలిపారు.

ఆలయాల ప్రారంభోత్సవాలకు ఎంపీ అరుణకు ఆహ్వానం

కొత్తూర్, ఆగస్టు 13: మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవతల ఆలయాల ప్రారంభ కార్యక్రమానికి రావాల్సిందిగా కోరుతూ మంగళవారం ఆలయాల కమిటీ సభ్యులు మహబూబ్‌నగర్‌కు వెళ్లి ఎంపీ డీకే అరుణకు ఆహ్వాన పత్రిక అందజేశారు. దాతల సహకారంతో మండల కేంద్రంలో 8 గ్రామ దేవతల ఆలయాలను అత్యాధునిక హంగులతో నిర్మించారు. ఈ నెల 16 నుంచి 23 వరకు ఆలయాల్లో అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలతో పాటు, పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బీజేపీ సీనియర్ నాయకుడు కడెంపల్లి సదానంద్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ జంగగళ్ల కృష్ణయ్య, వివిధ పార్టీల నాయకులు గోవిందరెడ్డి, మాసుల లక్ష్మయ్య, కర్రోళ్ల సురేందర్ తదితరులు డీకే అరుణను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు.



ఎంపీ డీకే.అరుణకు ఆహ్వానాన్ని అందజేస్తున్న గ్రామస్థులు

బీజేవైఎం ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 13: ప్రధాని మోదీ ఇచ్చిన 'హర్ ఘర్ తిరంగా' పిలుపు మేరకు మంగళవారం ఇబ్రహీంపట్నంలో బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్, బీజేవైఎం లీగల్ సెల్ కన్వీనర్ పగడాల శ్రీశైలం మాట్లాడుతూ.. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలనేది ప్రధాని పిలుపు అని అన్నారు. దేశ ఐక్యతను పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరు ఇందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బూడిద నర్సింహారెడ్డి, జంగయ్యగౌడ్, రవి, బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ వన్నవాడ రవీందర్‌రెడ్డి, రూపక్, విజయ్, ఐలేష్, మహేందర్, శుభర్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నంలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం కార్యకర్తలు

స్కూళ్లకు అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు

- కొరత ఉన్న చోట్ల తాత్కాలిక ఉపాధ్యాయుల నియామకం
- 'కడా' పరిధిలోని నాలుగు మండలాల్లోనే ఎంపిక
- 52 పాఠశాలల్లో 54 మంది ఎంపికకు అనుమతి
- బడుల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం చర్యలు



వికారాబాద్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన బదిలీలు, పదోన్నతుల ప్రక్రియతో పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి అనుమతిచ్చింది. వికారాబాద్ జిల్లాలో మొదట 85 మంది అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు అవసరమవుతారని గుర్తించగా, ఇప్పటి వరకు 'కడా' పరిధిలోని నాలుగు మండలాల్లోని 52పాఠశాలల్లో 54మంది నియామకానికి అనుమతిస్తూ కలెక్టర్ ప్రతీక్ జైన్ ఉత్తర్వులు జారీ చేశారు. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకాగా, గ్రామీణ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. కొత్తవారు జాయిన్ అయ్యే వరకు పాత వారిని రిలీవ్ చేయడం లేదు. అయితే తమను బదిలీ చోటుకు పంపాలని ఉపాధ్యాయులు విద్యాశాఖపై ఒత్తిడి తెస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో సరిపడినంత మంది ఉపాధ్యాయుల్లేక చదువులు సాగడం లేదు. ఉపాధ్యాయుల నియామకానికి ఇటీవల డీఎస్సీ నిర్వహించగా, సెప్టెంబరు 5న గురుపూజోత్సవం రోజున నియామకపత్రాలివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. అప్పటి వరకు ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాలు చేపట్టనున్నారు. వికారాబాద్ జిల్లాలో ముఖ్యమంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని 4 మండలాల పరిధిలోని 52 పాఠశాలల్లో 54 మందిని నియమించేందుకు అనుమతిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వారికి నెలకు రూ.15,600 గౌరవ వేతనం ఇస్తారు. మూడు నెలల కాలానికే అని అపాయింట్‌మెంట్ లెటర్లలో పేర్కొన్నా డీఎస్సీ నియామకాల వరకూ కొనసాగే అవకాశం ఉంది.

అర్హులు ఎవరంటే ..

స్కూల్ అసిస్టెంట్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు డిగ్రీ, బీఎడ్ విద్యార్హతలున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. అదే తెలుగు, హిందీ, ఉర్దూ పండిత్ పోస్టులకు డిగ్రీతో పాటు పండిత్ శిక్షణ పూర్తయిన వారు అర్హులు. స్కూల్ అసిస్టెంట్ అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకానికి ఎంపీడీవో అధ్యక్షతన ఎంఈవో, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ప్రతినిధి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, సంబంధిత పాఠశాల హెచ్‌ఎంలతో కమిటీలు ఏర్పాటు చేస్తారు. నియామక ప్రక్రియను ఈ నెల 15వ తేదీకల్లా పూర్తిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

'కడా' పరిధి పాఠశాలల్లోనే..

కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(కడా) పరిధి బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, దుద్యాల్, కొడంగల్ మండలాల్లో టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. బొంరాస్‌పేట్ మండలంలో రేగడి మైలారం, మహంతిపూర్, కొత్తూరు, లగచర్ల, ఎన్కేపల్లిల్లో 10 ఖాళీల్లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తారు. దౌల్తాబాద్ మండలం తిమ్మారెడ్డిపల్లి, నీటూరు, మాటూరు, దేవరఫస్లాబాద్, దౌల్తాబాద్, బాలంపేట్, బిచ్చాల్, సుల్తాన్‌పూర్, గుమ్‌డాల్లోని పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 21 పోస్టుల్లో ఇన్‌స్ట్రక్టర్లను నియమించనున్నారు. దుద్యాల్, హకీంపేట్, చిల్మల్ మైల్వార్, దుద్యాల్ ఉర్దూ మీడియం, ఏర్పమళ్ల పాఠశాలల్లో 12 మందిని నియమిస్తారు. కొడంగల్ మండలం హస్నాబాద్ ఉర్దూ మీడియం, అంగడి రాయిచూర్ ఉర్దూ మీడియం, అన్నారం, ఇందనూరు, టేకల్కోడ్, పర్సాపూర్, రుద్రారం, కొడంగల్, కస్తూర్‌పల్లి పాఠశాలల్లో 11 మందిని నియమించనున్నారు.

కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక

అకతడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకాల్లో మొదట పాఠశాల ఉండే గ్రామ పంచాయతీ/మునిసిపల్ పరిధిలో నివాసం ఉండే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు. పంచాయతీ, మునిసిపాలిటీలో అభ్యర్థులు అందుబాటులో లేకపోతే సమీప పంచాయతీల వారికి ప్రాధాన్యం ఇస్తారు. అక్కడా అర్హులు దొరక్కపోతే మండలంలోని గ్రామాల నుంచి దరఖాస్తు చేసుకున్న అర్హులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 16 నుంచి విధులకు హాజరయ్యే అవకాశం ఉంది.

యూత్ వింగ్‌కు జవసత్వాలు

- యువజన కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు నాయకత్వం కసరత్తు
- ఎన్‌ఎస్‌యూఐ, గ్రామ కమిటీల బలోపేతానికి చర్యలు
- పీసీసీ కార్యాచరణ.. నేటి నుంచే సభ్యత్వ నమోదు

తాండూరు, ఆగస్టు 13 : కాంగ్రెస్ పార్టీ అనుబంధ యువజన విభాగానికి ఎన్నికలు నిర్వహించనున్నారు. అధికారంలో కాంగ్రెస్ ఉండడం, సమీపంలో స్థానిక ఎన్నికలు రానుండడంతో అనుబంధ విభాగాల బలోపేతానికి పార్టీ రాష్ట్ర నేతలు సంకల్పించారు. రాష్ట్రస్థాయిలో యువజన విభాగ ఎన్నికలు ముగిసిన వెంటనే జిల్లా, మండల, నియోజకవర్గ కమిటీలకు ఎన్నికల నిర్వహణకు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రణాళిక రూపొందించింది. ఈ నెల 14 నుంచి యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు మొదలు కానుంది. సెప్టెంబర్‌లో యూత్ వింగ్‌కు ఎన్నికలు నిర్వహిస్తారు. పార్టీ స్టూడెంట్ వింగ్ అయిన ఎన్‌ఎస్‌యూఐకి కూడా ఎన్నికలు పెట్టనున్నారు. తాండూరు డివిజన్‌లో తాండూరు, కొడంగల్ మున్సిపాలిటీలు, తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్, కోటిపల్లి, కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, మద్దూర్ రూరల్ మండలాలు ఉన్నాయి. గ్రామ/మండల కమిటీలు, నియోజకవర్గ కమిటీల ప్రక్రియ పూర్తయ్యాక జిల్లా కమిటీని ఎన్నుకుంటారు. లోక్ బాడీల ఎన్నికల దృష్ట్యా తాండూరు పురపాలిక పరిధిలో పార్టీ పదవులకు పోటీ ఎక్కువగానే ఉండనుంది. దీన్ని బేస్ చేసుకునే ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ, విజయం ఆధారపడి ఉండడంతో పార్టీ పదవులకు ముఖ్యంగా యూత్ వింగ్ పదవులకు యువజన కాంగ్రెస్ నాయకులు పోటీ పడనున్నారు. కాగా ఈ నెల 14(నేటి) నుంచి యువజన కాంగ్రెస్ సభ్యత్వ నమోదు మొదలు కానుంది. కార్యకర్తలతో సభ్యత్వాలు చేయించి వారితో యూత్ వింగ్ నాయకులను ఎన్నుకుంటారు. నియోజకవర్గం, గ్రామ యూనిట్లుగా సభ్యత్వాలు చేపడుతారు. జిల్లా కేంద్రంలో మంత్రులు, నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభిస్తారు. జిల్లాలో ఈ ప్రక్రియంతటినీ జిల్లా కాంగ్రెస్ కమిటీ పర్యవేక్షించనుంది. యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పనిచేసిన వారికే పార్టీ పదవులు దక్కేలా చూడాలని డీసీసీలు, ఎమ్మెల్యేలకు పీసీసీ సమాచారం ఇచ్చింది. జిల్లా అధ్యక్షులు, కార్యవర్గాన్ని ఎన్నుకునే విషయంలో జిల్లాలోని ఎమ్మెల్యేందరితో సమన్వయం చేసుకొని ఎంపిక చేసుకోవాలని సూచించినట్లు సమాచారం. నియోజకవర్గానికి ఒక పదవి చొప్పున యువజన కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం ఉండేలా ప్రణాళిక అమలు చేయనున్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో చేసిన కృషిని కూడా లెక్కలోకి తీసుకోనున్నారు.

పేదల భూములను పెట్టుబడిదారులకు దోచిపెట్టొద్దు

- అభివృద్ధి పేరుతో ఫార్మా కంపెనీలకు ధారాదత్తం చేయొద్దు
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు


భూ సదస్సులో మాట్లాడుతున్న వెంకట్రాములు

కొడంగల్, ఆగస్టు 13: అభివృద్ధి పేరుతో కొడంగల్ నియోజకవర్గంలో రైతులు, పేదల భూములను పెట్టుబడిదారులకు దోచిపెట్టడం సరికాదని, అభివృద్ధి నమూనా అంటే ఇదేనా? అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు అన్నారు. మంగళవారం కొడంగల్‌లోని రెడ్డి బసిరెడ్డి గార్డెన్‌లో వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.వెంకట్రాములు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా భూ సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ఫార్మా కంపెనీ పేరుతో హకీంపేట్, లగచర్ల, పోలెపల్లి, పులిచర్ల, రోటిబండతండాల్లో 1,274 ఎకరాలు, కొడంగల్ మండలం ఎరన్‌పల్లిలో 74 ఎకరాలు మెడికల్, నర్సింగ్ కళాశాలలకు ప్రభుత్వం పేదల భూములను లాక్కోవడం దుర్మార్గం అన్నారు. తాము నియోజకవర్గ అభివృద్ధికి వ్యతిరేకం కాదన్నారు. కానీ రైతుల భూములను పెట్టుబడిదారులకు, ఫార్మా కంపెనీలకు అప్పజెప్పడం సరైంది కాదన్నారు. కొడంగల్ ప్రాంతంలో 1,156 ఎకరాల సీలింగ్ భూముల్లో ఫ్యాక్టరీలు, ఇతర సంస్థలను నెలకొల్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, వ్యకాస జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సంఘాల నాయకులు రామకృష్ణ, శ్రీనివాస్, యు.రమేశ్‌బాబు, బాలు, శ్రీనివాస్, మల్కయ్య, సుదర్శన్, సతీశ్, శ్రీనివాస్, సత్తయ్య, రఘురామ్, రైతులు మల్లికార్జున్, గోపాల్‌నాయక్, బసప్ప, యాదయ్య, శివకుమార్, సేవ్యనాయక్, రాములు, అనంతయ్య, అంజిలప్ప తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

యేటా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

శంకర్‌పల్లి, ఆగస్టు 13: ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి తప్పనిసరిగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని జిల్లా ఉపవైద్యాధికారి దామోదర్ తెలిపారు. శంకర్‌పల్లిలోని ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఇండియన్ కేన్సర్ సొసైటీ ఆధ్వర్యంలో కేన్సర్ స్ర్కీనింగ్ టెస్ట్ క్యాంప్‌ను నిర్వహించారు. అయన మాట్లాడుతూ 35సంవత్సరాలు నిండిన వారు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని స్పష్టం చేశారు. గుట్కాలు, పొగ, మద్యం తాగే అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వం, కేన్సర్ సొసైటీలు నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ శిబిరంలో 135 మందికి కేన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఐదుగురికి నోటి కేన్సర్ లక్షణాలు, 21మందికి సర్వైకల్ కేన్సర్ లక్షణాలు, ఒకరికి రొమ్ము కేన్సర్ లక్షణాలున్నట్లు గుర్తించామన్నారు. వీరందరినీ చికిత్స నిమిత్తం నగరంలోని కేన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీ ప్రాజెక్టు అధికారి రాకేశ్, వైద్యాధికారులు రేవతి, శ్రీనివాస్. సీహెచ్‌వో సం తోష, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ వైద్యులు అనూష, ప్రియాసింగ్, రఘు, వైద్య సిబ్బంది మన్సూర్, సుదర్శన్‌రెడ్డి ఉన్నారు.

ఢిల్లీలో స్వాతంత్ర్య దినోత్సవాలకు కోట్‌పల్లి టీచర్, విద్యార్థి


ఢిల్లీ బయలుదేరుతున్న లక్ష్మణ్, సాయిచరణ్

బంట్వారం(కోట్‌పల్లి),ఆగస్టు 13: కోట్‌పల్లిలోని జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ్, అదే పాఠశాల విద్యార్థి సాయిచరణ్‌లకు ఈ నెల 15న ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవాలకు ప్రత్యేక ఆహ్వానం అందింది. ఈ కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నుంచి సాయిచరణ్ ప్రశంసాపత్రం అందుకోనున్నారు. దేశవ్యాప్తంగా ప్రతిభావంతులైన విద్యార్థుల ఎంపికలో సాయిచరణ్ ఎంపికయ్యాడు.లక్ష్మణ్, సాయిచరణ్‌లు మంగళవారం హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.

పర్యటన విజయవంతం



సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిల అమెరికా పర్యటన మంగళవారం విజయవంతంగా ముగిసింది. రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా వారు ప్రపంచంలో పేరొందిన కంపెనీల యాజమాన్యాలతో అక్కడ చర్చలు జరిపారు. నేడు స్వదేశానికి రానున్నారు.

- పరిగి, ఆగస్టు 13

లక్ష్మప్పకు ఉత్తమ లైబ్రేరియన్ పురస్కారం


అవార్డు అందుకుంటున్న లక్ష్మప్ప

వికారాబాద్, ఆగస్టు 13: వికారాబాద్‌లోని జిల్లా గ్రంథాలయ గ్రంథ పాలకుడు ఎం.లక్ష్మప్ప రాష్ట్ర ఉత్తమ లైబ్రేరియన్ పురస్కారానికి ఎంపికయ్యారు. జాతీయ గ్రంథ పాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని స్టేట్ సెంట్రల్ లైబ్రరీలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు రియాజ్ నుంచి లక్ష్మప్ప ఉత్తమ లైబ్రేరియన్ పురస్కారాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర పౌర గ్రంథాలయాల శాఖ డైరెక్టర్ ఏవీఎస్.రాజు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మప్ప మాట్లాడుతూ.. తనకు రాష్ట్ర ఉత్తమ గ్రంథపాలకుడి అవార్డు దక్కడం సంతోషకరంగా ఉందన్నారు. ఈ పురస్కారం తనపై బాధ్యతను మరింత పెంచిందని, పాఠకులకు, విద్యార్థులకు మరిన్ని ఉత్తమ సేవలందించేలా కృషిచేస్తానన్నారు. తనను పురస్కారానికి ఎంపిక చేసిన కమిటీ సభ్యులకు, పురస్కార ప్రదాతలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

● మధ్యాహ్న భోజన కార్మికులు.. మండల కేంద్రాల్లో నిరసన



కందుకూరు : ఆర్డీవోకు కార్మికులతో కలిసి వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్

కందుకూరు, ఆగస్టు 13: ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేటు సంస్థ(హరేరామ హరేకృష్ణ)కు అప్పజెప్పడం విడ్డూరంగా ఉందని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ ఆరోపించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేటు సంస్థకు కేటాయించడాన్ని నిరసిస్తూ మంగళవారం కార్మిక సంఘం నాయకులతో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 24 సంవత్సరాలుగా రాష్ట్ర వ్యాప్తంగా 54వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో కార్మికులు విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని దిగ్విజయంగా అమలు చేస్తున్నట్లు గుర్తుచేశారు. అనంతరం ఆర్డీవో సూరజ్‌కుమార్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం మండల శాఖ అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి కళ్యాణ్‌కర్ శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్/శంషాబాద్ రూరల్ : మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ స్వచ్ఛంద సంస్థకు అప్పగించడం సరైంది కాదని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. శంషాబాద్ మండలంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థకు అప్పగిస్తే కార్మికులు జీవనోపాధిని కోల్పోతారన్నారు. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈమేరకు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఈవోకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుడు నీరటి మల్లేష్, రాజేష్, భారతమ్మ, సావిత్రి, రవీందర్, సునీత శివరాణి, శారదమ్మ లక్ష్మీదేవి లావణ్య రజిత తదితరు పాల్గొన్నారు.

యాచారం : తొమ్మిది నెలలుగా వేతనాలివ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సరికాదని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షురాలు వై.స్వప్న అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం యాచారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులతో కలిసి ధర్నాచేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ అయ్యప్పకు అందజేశారు. స్వప్న మాట్లాడుతూ కార్మికులకు నెలనెలా రూ.పదివేలు వేతనం ఇవ్వాలన్నారు.



కేశంపేట : ఎమ్మార్వో ఎదుట ఆందోళనకు దిగిన మధ్యాహ్న భోజన కార్మికులు

సీఎం రేవంత్‌రెడ్డి కార్మికులకు ఇచ్చిన హామీ నిలుపుకోవాలని కోరారు. సీఐటీయూ జిల్లా నాయకుడు చందూనాయక్‌తో పాటు కార్మికులు మల్లారి, కళమ్మ, యాదమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేట : మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని మధాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు అలివేలు, సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఎదుట ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులను పర్మినెంట్ చేసి రూ.10వేల వేతనం ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదని అన్నారు. అక్కమ్మ, కళావతి, బాలమణి, నీలమ్మ, జ్యోతి, వసంత, తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు. సీఐటీయూ శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి. కవిత హాజరై మాట్లాడుతూ కనీస వేతనాలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని 8 నెలలైనా అమలు చేయడం లేదన్నారు. సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కమిటీ కన్వీనర్ జె. పెంటయ్య కార్మిక సంఘం నాయకురాళ్లు పద్మ, లక్ష్మమ్మ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఎమ్మార్పీఎస్ చారిత్రక విజయం



మొయినాబాద్ : హిమాయత్ నగర్ నుంచి విజయోత్సవ ర్యాలీకి తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 13: ఎస్సీ వర్గీకరణ సాధించిన ఎమ్మార్పీఎస్‌ది చారిత్రక విజయమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ళ నర్సింహ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలుకుతూ హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ర్యాలీకి షాద్‌నగర్ నుంచి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ మంద కృష్ణ చేపట్టిన సుదీర్ఘ పోరాటానికి సుప్రీంకోర్టు సానుకూలమైన తీర్పు ఇవ్వడం, అందుకు కేంద్ర ప్రభుత్వం సైతం పూర్తి సహకారం అందించడం ఎమ్మార్పీఎస్ ఉద్యమ ఫలితమని అన్నారు.



కొందుర్గు : అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేస్తున్న నాయకులు

మొయినాబాద్ రూరల్ : మంద కృష్ణ మాదిగ విజయోత్సవ ర్యాలీకి ఎమ్మార్పీఎస్ శ్రేణులు మొయినాబాద్ మండలంలోని వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మండలాధ్యక్షుడు కొండిగారి మహేందర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సీనియర్ నాయకుడు కంజర్ల ప్రకాష్ హిమాయత్ నగర్ చౌరస్తాలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ప్రకాష్ మాట్లాడుతూ మంద కృష్ణ సుదీర్ఘకాలం చేసిన పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణకు అనుకూల తీర్పు అని తెలిపారు.

కొందుర్గు : హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీకి కొందుర్గు మండల ఎమ్మార్పీఎస్ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సీనియర్ నాయకులు ఆనంద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

సాకేతిక దీక్ష స్వీకరణ

శంషాబాద్ రూరల్, ఆగస్టు 13 : శంషాబాద్ మండలంలోని నర్కూడ ప్రభుత్వ పాఠశాల సమీపంలో గల ఆంజనేయస్వామి ఆలయంలో త్రిదండి చినజీయర్ స్వామి శాసనములతో పలువురు సాకేతిక దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుక్క వేణుగోపాల్ మంగళవారం దీక్ష స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు కుమార్ యాదవ్, నీరటి రాజు, లింగం, నర్సింహ, నీరటి మల్లేశ్, నర్కూడ మాజీ సర్పంచ్ సిద్దులు, నరగేశ్‌గౌడ్, సంజీవ, నీరటి అశోక్, బుక్క కృష్ణ, కుమార్‌యాదవ్, విష్ణు, నర్సింహ, పర్వతం, వినోద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరేయాలి



చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్యకు జాతీయ జెండాను అందజేస్తున్న అధికారులు

చేవెళ్ల, ఆగస్టు 13 : హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఊరే వాడా అంతటా ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఘర్ ఘర్ తిరంగా యువజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను సికింద్రాబాద్ డివిజనల్ పోస్టల్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి జాతీయ జెండాను అందించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ దేశంలోని ప్రతీ పౌరుడు ఆగస్టు 15లోగా ప్రతీ ఒక్కరి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశభక్తిని చాటుకోవాలని సూచించారు. పోస్టల్ శాఖ బీమా, టర్మ్ పాలసీలు, చిన్నమొత్తాల పొదుపు వంటి అనేక సేవలను ప్రజలు సద్వినియోగంచేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎంవో బీరయ్య, చేవెళ్ల పోస్ట్‌మాస్టర్ నరేష్, సతీష్, తపాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్.. పేదలకు వరం



చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 13 : సీఎంఆర్ఎఫ్ పేదలకు వరమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లెలగూడలోని ఎమ్మెల్యేక్యాంపు కార్యాలయంలో మహేశ్వరం మండలానికి చెందిన 65 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.19లక్షలకు పైగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా వచ్చిన డబ్బులను వృథా చేయకుండా కేవలం వైద్య ఖర్చుల నిమిత్తం వాడుకోవాలన్నారు. నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, రాజునాయక్, నవీన్, సుధీర్‌గౌడ్, కాడమోని ప్రభాకర్, గుత్తి పాండు, సలీంఖాన్, దయ్యాల శ్రీను, పోతుల నర్సింగ్, మోతీలాల్, చంద్రయ్య, సాదత్, ఆంజనేయులుగౌడ్, కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఖదీర్ కుటుంబానికి కేఎల్లార్ పరామర్శ

కందుకూరు, ఆగస్టు 13: మండలంలోని కొత్తగూడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, మాజీ వార్డు సభ్యుడు ఎండీ ఖదీర్ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. ఖదీర్ మాతృమూర్తి రజియాబేగం గుండెపోటుతో ఈ నెల 8న మృతిచెందింది. విషయం తెలుసుకున్న కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డిలతో కలిసి ఖదీర్ తండ్రి దస్తగిరి ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బొక్క భూపాల్‌రెడ్డి, నాయకులు సౌడపు శేఖర్‌గౌడ్, కుమ్మరి కృష్ణయ్య, బొక్క దామోదర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

కొందుర్గు, ఆగస్టు 13: ఉచిత వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయలక్ష్మి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఇండియన్ క్యాన్సర్ సొసైటీ, మాగ్నా కార్టా ఫౌండేషన్, ఎల్బీ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో విజయలక్ష్మి రోగులకు చేస్తున్న పరీక్షలను పరిశీలించారు. కొందుర్గు, జిల్లేడ్-చౌదరిగూడ మండల పరిధిలోని 142 మందికి పరీక్షలు నిర్వహించారు. కొందరిని హైదరాబాద్ క్యాన్సర్ ఆసుపత్రి, ఎంఎన్‌జే ఆసుపత్రికి రెఫర్ చేశారు. జనరల్ సమస్యలు ఉన్నవారికి పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. మండల వైద్యాధికారి అమృతాజోసఫ్, డాక్టర్లు నిఖిత, హరికిషన్, రాఘవేందర్, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు శ్వేత, బిందు రూప్సీ, సరిత, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

ఆమనగల్లు, ఆగస్టు 13: హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి రజకులు ఐక్యంగా ఉంటూ సంఘటితంగా ముందుకు సాగాలని రజక సంఘం ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు నాగిళ్ల బుచ్చయ్య పిలుపునిచ్చారు. కుల వృత్తి రక్షణకు, ఉపాధి కల్పనకు ప్రభుత్వాలు రజకులకు చేయూతనందించి ఆదుకోవాలని కోరారు. ఆమనగల్లు పట్టణంలో మంగళవారం ఆమనగల్లు మున్సిపాలిటీ రజక సంఘం సమావేశం నిర్వహించారు. జాతీయ రహదారిపై రజకులు భారీ ర్యాలీ నిర్వహించి ఐక్యతను చాటారు. రాజీవ్ చౌరస్తా వద్ద రజక సంఘం జెండాను సంఘం నాయకులతో కలిసి బుచ్చయ్య ఆవిష్కరించారు. రజకుల సమస్యలు, సంఘం బలోపేతంపై చర్చించారు. అర్హులైన పేదలకు పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాగిళ్ల బుచ్చయ్య

నూతన కార్యవర్గం ఏర్పాటు

ఆమనగల్లు మున్సిపాలిటీ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం నాయకులు సమావేశమై ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాగిళ్ల బుచ్చయ్య, ఉపాధ్యక్షులుగా నాగిళ్ల జంగయ్య, అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల తిరుపతయ్య, కోశాధికారిగా పాతకోట పకీర, ప్రచార కార్యదర్శిగా నాగిళ్ల బాలయ్య, కార్యదర్శిగా నాగిళ్ల శ్రీను, ప్రధాన సలహాదారుడిగా నాగిళ్ల చందులు ఎన్నికయ్యారు. అదేవిధంగా యువజన సంఘం అధ్యక్షుడిగా మద్దూరి ఆనంద్, ఉపాధ్యక్షులుగా మద్దూరి కుమార్, పాత కోట రాజు, ప్రధాన కార్యదర్శిగా నాగిళ్ల శేఖర్, కార్యదర్శిగా సందరాజు, పర్వతాలు, ప్రధాన సలహాదారుడిగా రాజు, సలహాదారులుగా నాగిళ్ల సాయి, నాగిళ్ల జగన్, కృష్ణయ్య, పగడాల కృష్ణ, నాగిళ్ల యాదయ్య, నాగిళ్ల శ్రీను, సందీప్, ఎం.కృష్ణ, సభ్యులుగా నాగిళ్ల యాదయ్య, సాయి, యాదయ్యలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాలను సంఘం నాయకులు సత్కరించారు.

లారీ యాజమానులకు అండగా ఉంటాం

కొత్తూర్, ఆగస్టు 13: లారీ యాజమానుల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నామని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూర్ పారిశ్రామికవాడలో నూతన ఏర్పాటు చేసిన లారీ, ట్రైలర్ల యాజమానులు అసోసియేషన్ కార్యాలయాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ లారీ యాజమానులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానని, సమస్యలు ఎదురైనప్పుడు తన దష్టికి తీసుకవస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం.శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, దేవేందర్ ముదిరాజ్, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, జంగ నర్సింహ, కుమారస్వామిగౌడ్, అన్వర్, అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.డీ ఖదీర్, రఫీక్, ఇమ్రాన్, ఖలీల్, సాజిద్ తదితరులున్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మేడిపల్లిలో బస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ రవీందర్‌గుప్త, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి

బస్సులను వినియోగించుకోవాలి

యాచారం, ఆగస్టు 13 : రైతులు, వ్యాపారులు రాకపోకలకు ఇబ్బందులు పడకుండా బస్సులను వినియోగించుకోవాలని పీఆర్‌జీ ఫౌండేషన్ అధ్యక్షుడు డా.రవీందర్‌గుప్త, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం మండలంలోని తాటిపర్తి నుంచి నానక్‌నగర్, మేడిపల్లి, మల్కీజ్‌గూడ, యాచారం మీదుగా కందుకూరు మండల కేంద్రం వరకు, తాటిపర్తి నుంచి ఉప్పల్ వరకు నడిచే బస్సులను వారు ప్రారంభించారు. కృష్ణ, తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

శంషాబాద్ రూరల్ : అల్ మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ ఆధ్వర్యంలో ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లిన ప్రయాణికులు మంగళవారం స్వదేశానికి తిరిగి వచ్చారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో యాత్రికులకు వారి కుటుంబ సభ్యులు ఘన స్వాగతం పలికారు. 15 రోజుల క్రితం 50మంది శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరి మక్కా మదీనాలో ప్రత్యేక ప్రార్థనలతో యాత్రను విజయవంతంగా పూర్తిచేసుకున్నారు.

తలకొండపల్లి : మండల కేంద్రంలో మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల పరిధిలోని 27 గ్రామ సంఘాల అధ్యక్షురాళ్లు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తలకొండపల్లికి చెందిన మల్లమ్మ, కార్యదర్శిగా చీపునుంతలకు చెందిన లావణ్య, కోశాధికారిగా చుక్కాపూర్‌నకు చెందిన శిరీషలు ఎన్నికయ్యారు.

కేశంపేట : మండల పరిషత్ అభివృద్ధి అధికారి రవిచంద్ర కుమార్ మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని సందర్శించి పుస్తకాలు, న్యూస్‌పేపర్లను పరిశీలించారు. కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలున్నాయాని ఆరా తీశా రు. కార్యదర్శి విద్యావతి, లైబ్రేరియన్ శ్రీనివాసులున్నారు.

చేవెళ్ల : మండల కేంద్రంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకుని ఇంటి దగ్గర వదిలిపెట్టడానికి బయలుదేరింది. లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం దగ్గరికి రాగానే బస్ బ్రేకింగ్ హేర్‌ట్యాంక్ ఊడిపోయింది. హైవే రోడ్డుపై జరిగి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు గంట సేపు బస్సులో ఉన్నారు.

షాబాద్ : రైతులు కంది పంటలో సస్యరక్షణ పద్ధతులు చేపట్టాలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ మేనేజర్ రత్నాకర్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు నెలల క్రితం క్రీడ కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి జిల్లా వారి సహకారంతో రేగడిదోస్వాడలలో షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక ద్వారా టీడీఆర్‌జీ 59 తెలంగాణ కంది 3వ రకం విత్తనాలను పంపిణీ చేశారు. మంగళవారం కంది సాగును పర్యవేక్షించి తగు సూచనలు సలహాలు రైతులకు ఇచ్చారు.

శంషాబాద్ రూరల్ : శంషాబాద్ రూరల్ సీఐ నరేందర్‌రెడ్డిని పీసీసీ జిల్లా నాయకుడు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఘన్సిమియా గూడ, గుండిగూడ గ్రామాల్లో సీసీ కెమెరాల పునరుద్ధరణ కోసం రూ.15వేల చెక్కును సీఐకి అందించారు.

కొందుర్గు : మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఇందుకోసం మహిళా సమాఖ్యల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ ఐబీ డీపీఎం స్వర్ణలత కోరారు. మండల సమాఖ్య భవనంలో నిర్వహించిన మండల మహిళా సమాఖ్య 20వ సర్వసభ్య సమావేశానికి హాజరయ్యారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలకు 14 విభాగాలకు సంబంధించి ఆర్థిక సహకారం అందజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ఆమనగల్లు : మంత్రి జూపల్లి కృష్ణారావును పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సత్కరించారు. వెల్దండ మండలం కుప్పగండ్లలో 18న నిర్వహించే సర్ధార్ సర్వాయిపాపన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రావాలని గౌడ సంఘం తాలుకా అధ్యక్షుడు అల్లాజీగౌడ్‌తో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

ఆమనగల్లు : ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు ప్రతీ ఒక్కరు తోడ్పాటునందించి ప్రోత్సహించాలని లయన్స్‌క్లబ్ కోశాధికారి గుజ్జరి నర్సింహ అన్నారు. ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గుజ్జరి హైమావతి స్మారకార్థం ఊరుకొండపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు 110 మందికి పరీక్ష ప్యాడ్‌లు, అట్లాస్, జామెట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

గిరిజన బాలికపై లైంగికదాడి

● గర్భం దాల్చడంతో ప్రైవేటు ఆసుపత్రిలో అబార్షన్

● ఆలస్యంగా వెలుగులోకి..

శంషాబాద్ రూరల్, ఆగస్టు 13 : ఓ గిరిజన బాలికను గర్భవతిని చేసి ఆపై అబార్షన్ చేసిన సంఘటన మంగళవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. స్థానికులు, సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జూకల్ అనుబంధ గ్రామం ఎర్రకుంట తండాకు చెందిన ఓ మహిళ తన కూతురు(16)తో కలిసి జూకల్ గ్రామానికి చెందిన మన్నె కృష్ణారెడ్డి దగ్గర కూలి పనులకు వెళ్తుండేది. ఈక్రమంలో కృష్ణారెడ్డి బాలికను వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న గదిలోకి తీసుకెళ్లి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఇటీవల బాలికకు కడుపునొప్పి రావడంతో తల్లి ఆస్పత్రిలో చూపించింది. పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు బాలిక ఏడు నెలల గర్భవతి అని తేల్చారు. దాంతో తల్లిదండ్రులు బాలికను నిలదీయగా.. కృష్ణారెడ్డి పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడని చెప్పింది. నిందితుడు గుట్టు చప్పుడు కాకుండా కొత్తూరులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో అబార్షన్ చేయించాడు. ఈక్రమంలో రెండు రోజులు తనపై ఎవరూ ఫిర్యాదు చేయకుండా కృష్ణారెడ్డి అడ్డుకున్నాడు. బాలిక తల్లి ధైర్యం చేసి మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కొందరు గిరిజన నాయకులు నిందితుడిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారం కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కొందరు నిందితుడిని తప్పించాలని చూస్తున్నారని.. బాలికకు న్యాయం జరగకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని పలు గిరిజన సంఘాల నాయకులు హెచ్చరించారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. అయితే, నిందితుడిని త్వరలోనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని ఆయన చెప్పారు. కాగా, కృష్ణారెడ్డి వివాహితుడు.

శంకర్‌పల్లిలో వివాహితపై..

శంకర్‌పల్లి, ఆగస్టు 13 : వివాహితపై లైంగికదాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేసి మంగళవారం రిమాండుకు తరలించినట్లు శంకర్‌పల్లి సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కూలి పని చేసుకుని జీవనం సాగించే ఓ వివాహిత(23)ను రవి అనే వ్యక్తి ఆదివారం అర్ధరాత్రి శంకర్‌పల్లి పట్టణంలో తన ఇంటి డాబాపైకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. సోమవారం సాయంత్రం బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు రవిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు. కాగా, రవి గతంలో పలు నేరాలకు పాల్పడినట్లు సీఐ హబీబుల్లాఖాన్ తెలిపారు.

రౌడీషీటర్ హత్య కేసులో నలుగురి అరెస్టు

యాచారం, ఆగస్టు 13 : నగర శివారులోని బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల రౌడీషీటర్ రియాజ్‌ను హతమార్చిన కేసులో నలుగురిని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసుల సాయంతో యాచారం మండల పరిధిలోని మేడిపల్లిలో బాలాపూర్ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. కాగా, హత్య అనంతరం మేడిపల్లిలో హంతకులు మున్వర్ అనే వ్యక్తి ఇంటిని అద్దెకు తీసుకున్నారు. బాలాపూర్ పోలీసులు హంతకుల కోసం వేట గాలింపు చేపట్టగా మేడిపల్లిలో ఉన్నట్లు తెలుసుకుని మంగళవారం దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించారు. అనంతరం మేడిపల్లి చెరువు అలుగు సమీపంలో రక్తపు మరకలున్న దుస్తులను స్వాధీనం చేసుకున్నారు. హంతకులు తలదాచుకున్న ఇంట్లో కత్తులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ సమయంలో స్థానిక పోలీసులను కూడా ఇంట్లోకి రానివ్వలేదు. కాగా, మేడిపల్లిలో అదుపులోకి తీసుకున్న హంతకుల పేర్లను పోలీసులు చెప్పడానికి నిరాకరించారు. ఇదే విషయమై బాలాపూర్ సీఐని 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా వివరాలు చెప్పడానికి వారుకూడా నిరాకరించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయాలు

● బ్రెయిన్‌డెడ్ కావడంతో అవయవాల దానం

మాడ్గుల, ఆగస్టు 13 : రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మండలంలోని సుద్దపల్లి గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. సుద్దపల్లికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గోవింద్ ఇటీవల గుర్మేడ్ గేటు వద్ద రోడ్డుపై వెళుతుండగా స్పీడ్‌బ్రేకర్ వద్ద సడెన్‌బ్రేక్ వేయడంతో బైక్ పైనుంచి కిందపడ్డాడు. దాంతో అతడు తీవ్రంగా గాయపడగా స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా.. ఓ ప్రవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా, అతడి బ్రెయిన్‌డెడ్ కావడంతో మృతిచెందాడని వైద్యులు ధ్రువీకరించారు. అయితే, ఆగస్టు 13న వరల్డ్ ఆర్గానిక్ డొనేషన్ డే కావడంతో కుటుంబ సభ్యులు గోవింద్ అవయవాలు దానం చేసేందుకు నిర్ణయం తీసుకొని వైద్యులకు హామీ పత్రం ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

విద్యుదాఘాతంలో ఎద్దు మృత్యువాత

చేవెళ్ల, ఆగస్టు 13 : విద్యుదాఘాతంలో ఎద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దేవరంపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. దేవరంపల్లి గ్రామానికి చెందిన బాధిత రైతు అమరేందర్‌రెడ్డి రోజు మాదిరిగానే ఎద్దును పొలం వద్ద మేతకు తీసుకెళ్లాడు. ఈక్రమంలో పొలం పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు వెళ్లడంతో కరెంట్ షాక్ తగిలింది. ఆర్థికంగా ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

నియాజ్‌ఖానాలో మందు పార్టీ

● పోలీసుల దాడి.. పలువురిపై కేసు

కొత్తూర్, ఆగస్టు 13: రాష్ట్రంలో పేరుగాంచిన, పవిత్ర దర్గాగా గుర్తింపు ఉన్న హజ్రత్ జహంగీర్‌పీర్ దర్గా వద్ద గల ఓ నియాజ్‌ఖానాలో మంగళవారం రాత్రి నిర్వహిస్తున్న మందు పార్టీపై స్థానిక పోలీసులు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఎస్సై జి.శ్రీనివాస్ కథనం ప్రకారం.. కొత్తూర్ శివారులోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న ఓ వ్యక్తి ఇటీవల బదిలీ కాగా, తోటి ఉద్యోగులకు విందు ఇచ్చేందుకు దర్గా పరిసరాల్లోని ఓ నియాజ్‌ఖానాను అద్దెకు తీసుకున్నాడు. అక్కడ మందు, విందు ఏర్పాటు చేశారు. దర్గా పరిసరాల్లో మద్యం సేవించరాదని నిబంధనలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పార్టీ ఏర్పాటు చేయడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై సిబ్బందితో జేపీ దర్గాకు చేరుకుని నియాజ్‌ఖానాపై దాడి నిర్వహించారు. అయితే, అప్పటికే మందు బాబులు అక్కడినుంచి పరారయ్యారు. కొందరు మందుబాబులు మాత్రం పోలీసులకు చిక్కినట్లు సమాచారం. నియాజ్‌ఖానా యాజమానితో పాటు మద్యం సేవించిన వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ఈ సంఘటన సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

వివాహేతర సంబంధం, హత్య కేసులో

ముగ్గురికి జీవిత ఖైదు

కేశంపేట, ఆగస్టు 13: వివాహేతర సంబంధంతో పాటు హత్య కేసులో ముగ్గురికి జీవిత ఖైదు విధిస్తూ రంగారెడ్డి జిల్లా 9వ అదనపు న్యాయాధికారి హరీష తీర్పు వెల్లడించారు. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం కేశంపేట మండలం చింతకుంటపల్లికి చెందిన చల్లంపల్లి జంగయ్య భార్య జంగమ్మ అదే గ్రామానికి చెందిన జిన్నారం శివకుమార్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. విషయం తెలిసిన జంగయ్య తన జంగమ్మను తరచూ మందలించేవాడు. ఈ విషయం మనసులో పెట్టుకున్న జంగమ్మ శివకుమార్, అదే గ్రామానికి చెందిన నాగపోగు గణేష్‌తో కలిసి భర్తను అంతమొందించాలని పథకం వేసింది. 2020 ఆగస్టు 23న జంగయ్యను హత్య చేశారు. జిన్నారం చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన అప్పటి సీఐ రామకృష్ణ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ రఘు ఈ కేసుకు సంబంధించి దోషులను సాక్ష్యాధారాలతో కోర్టులో నిరూపించడంతో మంగళవారం న్యాయాధికారి హరీష ముగ్గురిని నిందితులుగా తేల్చి జీవిత కాల శిక్ష విధిస్తూ తీర్పును వెల్లడించారు. అలాగే జిన్నారం శివకుమార్‌కు రూ.30వేలు, నాగపోగు గణేష్, చల్లంపల్లి జంగమ్మలకు రూ.20వేలు జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.